



ఇది కదా **అభివృద్ధి**

రూ.200 కోట్లతో విద్యుత్ వెలుగులు

- 'తూర్పు'లో నాలుగేళ్లలో 1300 పనుల పూర్తి
- రూ.77 కోట్లతో భూగర్భ విద్యుత్తు లైన్లు
- రూ.50 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్లు
- మరో రూ.153 కోట్ల పనులకు ప్రతిపాదనలు

తీవ్ర గాలులు, వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం కమ్మేదం నాలుగేళ్ల కిందట వరకు చూశాం. ఇప్పుడు భారీ తుఫాన్లు వచ్చిన సరే.. కరెంట్ కోత అనేది ఉండడం లేదు. ఇందుకు కారణం జగనన్న ప్రభుత్వం విద్యుత్ సౌకర్యాల కల్పనకు చేసిన కృషే. తూర్పు నియోజకవర్గం పరిధిలో నాలుగేళ్లలో విద్యుత్తు సౌకర్యాల కోసం సుమారు రూ.200 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. రానున్న రోజుల్లో మరో రూ.150 కోట్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించింది.



బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సోలార్ దీపాలు

బీచ్ రోడ్డు: తూర్పు నియోజకవర్గంలో విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడ్డాయి. గతంలో వలే విద్యుత్ కోతలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూగర్భ విద్యుత్తు లైన్ల పనులను వేగవంతం చేసింది. టీడీపీ హయాంలో ఈ పనులు ప్రతిపాదనలకే పరిమితం కాగా.. సీఎం వైఎస్ జగన్ సర్కారు నాలుగేళ్లలో 80 శాతం పూర్తి చేసింది. ఇందుకుగాను సుమారు రూ.77 కోట్లు ఖర్చు చేసింది.

వచ్చే ఏడాదికి పూర్తి

మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. వచ్చే ఏడాది నాటికి తూర్పు నియోజకవర్గం మొత్తం భూగర్భ విద్యుత్తు లైన్ల ఏర్పాటు పూర్తి కానుంది. ఇప్పటికే బీచ్ రోడ్డు, రామ్‌నగర్, సిరిపురం, పాండురంగాపురం, దసపల్లాహిల్స్, చినవాల్తేరు, ఏయూ, శివాజీపాలెం, ఉషోదయ జంక్షన్ ప్రాంతాల్లో భూగర్భ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మిగిలిన ఎంవీపీ కాలనీ, ఆరిలోవ సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. టెండర్లు పూర్తయిన వెంటనే ఈ సబ్ డివిజన్‌లో కూడా భూగర్భ విద్యుత్తు లైన్ల పనులను పూర్తి చేయనున్నారు.

ఒక్క రోజులో విద్యుత్ దీపాల ఏర్పాటు

గతంలో వీధి దీపాలు పోతే వాటిని మళ్లీ ఏర్పాటు చేయడానికి చాలా రోజుల సమయం పట్టేది. జోనల్ స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు వెళ్తేగానీ సమస్య పరిష్కారమయ్యేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో త్వరితగతిన సమస్యలకు మోక్షం కలుగుతోంది.

వచ్చే ఏడాదికి పూర్తి స్థాయి వసతులు

ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో భూగర్భ విద్యుత్ లైన్లు, ఇండోర్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.153 కోట్ల పనుల ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. వాటిలో చాలా వరకు అనుమతి లభించడంతో పాటు టెండర్లను కూడా ఆహ్వానించారు. ఆ పనులను త్వరలోనే ప్రారంభించి 2024 నాటికి పూర్తి చేయనున్నారు.

నాలుగేళ్లలో 1300 పనులు

గత నాలుగేళ్లలో తూర్పు నియోజకవర్గం పరిధిలో 1300 పనులను విద్యుత్ శాఖ పూర్తి చేసింది. వీటిలో 1000కు పైగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మరమ్మతులు, 150 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మరమ్మతులు, రెండు సబ్ స్టేషన్ల మరమ్మతులు, నూతన విద్యుత్ లైన్లు, మరమ్మతులు ఉన్నాయి. ఇండోర్ సబ్ స్టేషన్లు, భూగర్భ విద్యుత్ లైన్ ఏర్పాటుతో పాటు మొత్తం ఇందు కోసం సుమారు రూ.200 కోట్లు వెచ్చించారు.

ఐదు చోట్ల ఇండోర్ సబ్ స్టేషన్లు

తుపాన్, పెద్ద గాలులు వచ్చినప్పుడు అవుట్ డోర్ సబ్ స్టేషన్లు విద్యుత్ లైన్లు కలిసిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు తలెత్తడం జరుగుతుండేవి. తద్వారా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేది. ఈ సమస్యకు పరిష్కారం కోసం ఇప్పటికే రూ.50 కోట్లతో ఇండోర్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీని వల్ల ఎంత పెద్ద తుపాన్ వచ్చినా సబ్ స్టేషన్‌కు ఎటువంటి ప్రమాదం జరగదు. ఇటువంటి సబ్ స్టేషన్లను బీచ్‌రోడ్డు, సిరిపురం, రామ్‌నగర్, సీఎంఆర్ సెంట్రల్, శివాజీపాలెం పరిధిలో ఏర్పాటు చేశారు. మరో రెండు ఇండోర్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



బీచ్ రోడ్డులో ఇండోర్ సబ్ స్టేషన్

పర్యాటక ప్రాంతాల్లో సౌర వెలుగులు

పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఆదాలో భాగంగా పర్యాటక ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి భారీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ముడసర్లలోవ పార్కు వద్ద ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు కూడా సౌర విద్యుత్ ద్వారానే వెలుగుతున్నాయి. బీచ్‌రోడ్డు, వీఎంఆర్‌డీఏ పార్కు, కైలాసగిరి, శివాజీ పార్కు, ముడసర్లలోవ పార్కులో సౌర వెలుగులు విరజిమ్ముతున్నాయి.

నిరంతరం విద్యుత్ సరఫరా



ఒకప్పుడు మా వీధిలో విద్యుత్ దీపాల వెలుగులు అప్పుడప్పుడు చూసే వాళ్లం. ఒక్క రోజు వెలిగితే నెలల తరబడి పని చేయకుండా ఉండేవి. కానీ గత నాలుగేళ్లలో రాత్రి అయితే చాలు విద్యుత్ వెలుగులతో మా కాలనీ ధగధగలాడుతోంది. ఏ సమస్య వచ్చిన వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తున్నారు. నగరంలో విద్యుత్ కోతలకు చెక్ పడింది.

– పి.కళ, పీతానిదిబ్బ

మెరుగుపడిన విద్యుత్ సదుపాయాలు

నాలుగేళ్లలో ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో విద్యుత్ సౌకర్యాలు చాలా వరకు మెరుగుపరిచాం. మరింతగా అభివృద్ధి చేసేందుకు రూ.153 కోట్ల పనుల ప్రతిపాదనలు పంపాం. అలాగే చివర దశలో ఉన్న భూగర్భ విద్యుత్ లైన్ల పనులకు సంబంధించి టెండర్లను కూడా పిలిచాం. త్వరలో వాటిని ఫైనల్ చేసి పనులు ప్రారంభించనున్నాం.

– సింహాచలం నాయుడు, డీఈ, ఈపీడీసీఎల్ జోన్–1

క్లుప్తంగా

రామకృష్ణాపురం సందర్శన

ఆరిలోవ: మిచాంగ్ తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా రూరల్ మండలం పరిధిలో లోతట్టు, కొండవాలు ప్రాంతాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, రూరల్ మండలం తహసీల్దారు సనపల రమణయ్య, సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. గతంలో చిన్నపాటి వర్షానికే ఈ గ్రామంలో నివాసాల్లోకి నీరు చేరుతుండేది. ఇటీవల ఇక్కడ గెడ్డ, దానిపై బ్రిడ్జి నిర్మించడంతో ముంపు సమస్య తప్పింది. ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేదని స్థానికులు అధికారులకు వివరించారు. అనంతరం హనుమంతవాక, బీఎస్ఆర్ నగర్ కొండవాలు ప్రాంతాలు సందర్శించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని తహసీల్దారు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ.. భక్తుల పేరిట అర్చనలు నిర్వహించారు.

యాచకుడి మృతి



మృతి చెందిన యాచకుడు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో ఓ యాచకుడు మంగళవారం మృతి చెందాడు. రెండు రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా తినడానికి ఏమీ దొరకలేదు. ఉండడానికి కూడా సరైన స్థలం లేకపోవడంతో చలికి యాచకుడు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు జీవీఎంసీ సిబ్బంది సహకారంతో కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

లలితా పీఠంలో చండీ హోమం



లలితాపీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: స్థానిక లలితానగర్‌లోని లలిత పీఠంలో కార్తీక మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 1000 గారెలతో కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10న విజిల్ బ్లోయర్ చిత్ర ప్రదర్శన

సీతంపేట: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల అంశంపై రూపొందించిన 'విజిల్ బ్లోయర్' ఆంగ్ల చిత్రాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సినిమా తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

తడిసిముద్దయిన నగరం

- ఉదయం నుంచి ఎడతెరిపివ్వని వర్షం
- పలు చోట్ల విరిగిన చెట్ల కొమ్మలు
- పొంగిపొర్లిన కాలువలు, గెడ్డలు



ఈస్ట్‌పాయింట్ కాలనీలో కాలువలో వ్యర్థాల తొలగింపు

ఏయూ క్యాంపస్: తుపాను కారణంగా ఉదయం నుంచి కురిసిన వర్షానికి తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. చినవాల్తేరు, పెదవాల్తేరు, ఈస్ట్‌పాయింట్ కాలనీ, శివాజీపాలెంలోని పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. వీటిని యుద్ధప్రాతిపదికన జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఈస్ట్‌పాయింట్ కాలనీలోని గెడ్డలో భారీ వర్షం కారణంగా పేరుకుపోయిన వ్యర్థాలు, కొట్టుకు వచ్చిన చెత్తను పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. పలు చోట్ల కాలువల్లో వ్యర్థాలు అడ్డుపడి నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో పారిశుధ్య సిబ్బంది వర్షానికి సైతం లెక్కచేయకుండా చెత్తను తొలగించే పనులు చేపట్టారు. శివాజీపాలెంలో కాలువలు నిండిపోయి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. దాదాపు 2 నుంచి 3 అడుగుల మేర వర్షపు నీరు ప్రవహించడం కనిపించింది. ఉదయం నుంచి జోరుగా వర్షం కురుస్తుండడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

నిర్మానుష్యంగా ఏయూ ప్రాంగణం

ఏయూ క్యాంపస్: తుపాను కారణంగా సెలవు ప్రకటించడంతో మంగళవారం ఆంధ్రవిశ్వవిద్యాలయం బోసిపోయింది. వర్సిటీలో ఉద్యోగులు, విద్యార్థులు రాకపోవడంతో వెలవెలబోయింది. ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. కేవలం భద్రత సిబ్బంది మాత్రమే విధులకు హాజరయ్యారు. విద్యార్థులకు మెస్‌లలో భోజనం సిద్ధం చేసి వడ్డించారు. విద్యార్థులు సైతం వర్షం కారణంగా హాస్టళ్ల గదులకే పరిమితమయ్యారు.



కేడీపీఎం పాఠశాల వద్ద కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఆరిలోవ జలమయం

ఆరిలోవ: కుండపోతగా కురుస్తున్న వర్షానికి మంగళవారం ఆరిలోవ ప్రాంతం జలమయమైంది. రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. సోమవారం అర్ధరాత్రి నుంచి పెద్ద జల్లులతో భారీ వర్షం కురిసింది. దీంతో బీఆర్‌టీఎస్‌తో పాటు ప్రధాన రహదార్లు జలమయమయ్యాయి. పెదగదిలి, చినగదిలి ప్రాంతాలలో కొండవాలు నుంచి వచ్చిన వరద నీటితో బీఆర్‌టీఎస్ రోడ్డుపై పెదగదిలి కూడలి నిండిపోయింది. దీంతో నగరం నుంచి వచ్చిన వాహనచోదకులు హనుమంతవాక మీదుగా సింహాచలం, ఆరిలోవ వెళ్లాల్సినవారు నానా ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడపలేక కొందరు వర్షపు నీటి మధ్యలో నిలిపేసి రోడ్డు పక్కన నిరీక్షించారు. వర్షం తగ్గాక కొంత సేపటికి వాహనాలను తిరిగి తీసుకెళ్లారు. పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మధ్యలో గెడ్డపై ఉన్న కల్వర్టు మీద నీరు నిలిచిపోయింది. ఇటీవల నిర్మాణం చేపట్టిన చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ వరకు కొత్త రోడ్డు కూడా హెల్త్‌సిటీ నుంచి వచ్చిన వరద నీటితో నిండిపోయింది. ఈ ప్రాంతంలో గెడ్డలు, ప్రధాన కాలువలు పొంగిపొర్లాయి.

మద్దిలపాలెం: తుపాను కారణంగా ఎడతెరిపిలేని వర్షాలకు మద్దిలపాలెం రోడ్లు జలమయమయ్యాయి. కాలనీలో కాలువలు వర్షపు నీటితో నిండిపోయాయి. చెత్తా చెదారం రోడ్లపై పేరుకుపోయింది. జనం ఇళ్లకే పరిమితం కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే మద్దిలపాలెం కూడలి బోసిపోయింది.

బీచ్ రోడ్డు: ఈదురు గాలులకు మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వెళ్లే మార్గంలో మంగళవారం ఓ చెట్టు కూలిపోయింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలగడంతో మూడో పట్టణ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కూలిన చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



శివాజీపాలెంలో నీట మునిగిన వాహనాలు



మద్దిలపాలెం కూడలిలో జోరుగా కురుస్తున్న వర్షం



సత్యం కూడలి రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు



చినగదిలి, సూర్యతేజానగర్ మధ్య నిర్మించిన కొత్త రోడ్డుపై చేరిన వర్షపు నీరు



ఆరిలోవ ప్రాంతంలో కుండపోతగా కురుస్తున్న వర్షం



పెదగదిలి కూడలిలో నిలిచిన వరద నీటిలో వాహనాల రాకపోకలు

ముడసర్లోవలో బ్రిటిష్ కాలం నాటి ఆనవాళ్లు

మీకు తెలుసా?



వాటర్ ఫౌంటేన్



బ్రిటిష్ అధికారుల గెస్ట్ హౌస్

ఆరిలోవ: కార్తీక మాసం రాగానే పిక్నిక్‌ల స్పాట్‌గా నగరవాసులకు ముడసర్లోవ పార్కు గుర్తుకువస్తుంది. ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. దీంతో ఇక్కడ ఎక్కువ మంది నగరవాసులు, కులాలు, సంఘాలు, యూనియన్లు, కుటుంబాలు వనభోజనాలు జరుపుకొంటారు. అయితే ఇక్కడ గతంలో ఉండే కొన్ని ముఖ్యమైన విషయాలు ఎక్కువ మందికి తెలియవు. ఎందుకంటే అవి మరుగునపడ్డాయి. అందుకే వాటిని అందరూ మరిచిపోయారు. అవి ఏమిటో తెలుసుకొందాం. ముడసర్లోవ పార్కు బ్రిటిష్ కాలంలో నిర్మించారు. అప్పట్లో విశాఖపట్నం వచ్చిన బ్రిటిష్ అధికారులు విశ్రాంతి తీసుకోవడానికి, విడిది చేయడానికి గెస్ట్ హౌస్ నిర్మించారు. దీన్ని అప్పట్లో ఇటుక, పెంకులతో నిర్మించారు. ఇప్పుడు ఆ గెస్ట్ హౌస్ శిథిలమైంది. ఎప్పుడు కూలుపోతుందో తెలియని ప్రమాదకర పరిస్థితిలో ఉంది. బ్రిటిష్ కాలం అనంతరం సందర్శకుల సౌకర్యం కోసం జీవీఎంసీ కూడా ఇక్కడ కొన్ని వసతులు సమకూర్చింది. 1990లో స్విమ్మింగ్ పూల్ నిర్మించింది. సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. అప్పట్లో ఇక్కడకు వెళ్లిన సందర్శకులు, స్థానికులు దీంట్లో ఈతకొడుతూ గంటలు తరబడి గడిపేవారు. ఇప్పుడు ఇది మూలకు చేరింది. దీనిలో ఏపుగా గడ్డి మొలిసి స్విమ్మింగ్ పూల్‌ను మూసేసింది. ఇటువైపు సందర్శకులు వెళ్లినా స్విమ్మింగ్ పూల్ ఉన్నట్లు ఆనవాలు కూడా కనిపించడంలేదు. దీన్ని ఆనుకొని మొసళ్ల కొలను ఉండేది. ఇందులో మొసళ్లు సందర్శకులను అలరించేవి. ఇప్పుడు ఇది పిచ్చి మొక్కలతో నిండిపోయింది. చూసేవారికి ఏదో గొయ్యిలా కనిపిస్తోంది. దీని పక్కనే వాటర్ ఫౌంటేన్ ఉండేది. ఇది కూడా శిథిలమై అస్తవ్యస్తంగా మారిపోయింది. ఇవి మళ్లీ అందుబాటులోకి వస్తే చూడాలని ఉందంటూ సందర్శకులు ఆశిస్తున్నారు.

పలు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో గల పలు ఐఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆడమ్స్ ఐవీఎఫ్ కేంద్రంలో ఏఆర్‌టీ బ్యాంక్, పద్మశ్రీ ఐవీఎఫ్‌లో ఏఆర్‌టీ లెవెల్–2, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఏఆర్‌టీ లెవెల్–1, గీతం ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషీన్లను తనిఖీ చేశారు. ఆస్పత్రులకు ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయో లేదో, వైద్యులు, ఉద్యోగుల విద్యార్హతలను పరిశీలించారు. ల్యాబ్ పరికరాలను పరిశీలించి సలహాలు ఇచ్చారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీ బృందంలో డాక్టర్ గీతా వందన, ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జోన్-5లో షాపులకు 22న బహిరంగ వేలం

కంచరపాలెం: జీవీఎంసీ జ్ఞానాపురం జోన్-5 పరిధిలోని 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల 24 వార్డులకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 15, 41, 46, 48, 52, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సుబ్బలక్ష్మీనగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 9, 13, 14 నంబర్ల షాపులు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 షాపులు, ములగాడ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, 4, అశోక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 నంబర్ల షాపులకు మూడేళ్ల కాల పరిమితి, జీవీఎంసీ 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపానికి మూడు సంవత్సరాలు, జనతా కాలనీ, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు ఒక సంవత్సరం కాల పరిమితితో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ ఆవిష్కరణ

బీచ్ రోడ్డు: రాష్ట్రంలో తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో యువత పాల్గొనాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. మంగళవారం క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లను ఆయన కార్యాలయంలో పరిశీలించారు. అనంతరం లోగోను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగనున్నాయన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ